క్లుప్తంగా

వావిలాల సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి అన్నారు. వావిలాల జయంతి వేడుకలను సర్వోదయ మండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ విలువలు కలిగిన రాజకీయనేత వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా పోరాడటంతో పాటు, స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన మహనీయుడని అన్నారు. అనేక ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన వావిలాల గోపాలకృష్ణయ్య ఎందరికో స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

అంతరిక్ష యానం వైపు లయోలా పూర్వ విద్యార్థి



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతరిక్షంలో జీవితాన్ని గడపడానికి ముందుకు సాగుతున్న ఆంధ్రా లయోలా కళాశాల పూర్వ విద్యార్థిని ఆనీ సత్తెనపల్లి మనందరికీ గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదస్సులో అనీ అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలో, విదేశాల్లో ఖగోళ జీవశాస్త్రంలో అధ్యయనాల వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ ఇండోర్ నుంచి మాస్టర్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆనీ ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వ విద్యాలయంతో కలిసి యుజిమార్ట్, ఎండబ్ల్యూఏ వంటి అత్యాధునిక టెలిస్కోప్‌లను ఉపయోగించి పల్సర్‌లపై విస్తృతంగా పనిచేశారన్నారు. ఆమె పరిశోధన ఇప్పుడు యూకేలోని ఎడిన్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో ఆస్ట్రోబయాలజీ వైపు ఉత్తేజకరమైన మలుపు తీసుకున్నట్లు తెలిపారు. అక్కడ ఆమె భూమికి ఆవల జీవం ఉండే అవకాశాలను అన్వేషించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏపీటీ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి.సహాయ భాస్కరన్, డాక్టర్ పీవీఎస్ సాయిరాం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఫాదర్ వైటి ప్రభులు సత్తెనపల్లి ఆనీ సాధించిన విజయాలను ప్రశంసించారు.

20న సంగీత మహోత్సవం

విజయవాడకల్చరల్: శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ శనివారం దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి సీవీ రావ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విఖ్యాత యువ సంగీత కళాకారిణి చారుగండ్ల శ్రావణి వేణుగాన కచేరీ, జొన్నలగడ్డ సాయి శ్రావణి కర్నాటక సంగీత కచేరీ నిర్వహిస్తారన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి అధ్యక్షుడు డాక్టర్ మన్నెం గోపీచంద్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెం 200లో రాంపిళ్ల హరికృష్ణ(37) నివాసం ఉంటున్నాడు. హరికృష్ణకు శాంతి అనే మహిళతో వివాహం కాగా వారి మధ్య విభేదాలు రావడంతో ఏడాది కాలంగా వేరుగా ఉంటున్నారు. భార్య దూరంగా ఉండటంతో మానసికంగా కుంగిపోయిన హరికృష్ణ తన గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరికృష్ణ కుమారుడు అశోక్ తన పెదనాన్న బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం చెప్పగా, బాలకృష్ణ హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లేసరికి అప్పటికే హరికృష్ణ మృతి చెందాడు. ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురికి జైలుశిక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురికి న్యాయస్థానం వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై మూడో ట్రాఫిక్ పోలీసులు బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని 7వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్.వి.ఎస్ శర్మ ఒక్కొక్కరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారని చెప్పారు.

నాడు చోద్యం - నేడు పరాధీనం

నాడు టీడీపీ ప్రభుత్వం చేతగానితనంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన పున్నమి ఘాట్‌లో కేంద్ర బిందువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఇప్పుడు ప్రభుత్వం నిర్వహించే ఈవెంట్లకు స్థలం లేక ప్రైవేటు స్థలాలను ఆశ్రయించవలసి వస్తోంది.

- కోట్లు కుమ్మరించిన పున్నమిఘాట్ సెంటర్ పాయింట్ ప్రైవేటు చేతుల్లోకి
- కోర్టుకు వెళ్లిన వారికి అప్పగించి చేతులు దులుపుకొన్న టీడీపీ ప్రభుత్వం
- నేడు ప్రభుత్వ ఈవెంట్లకు ప్రైవేట్ గ్రౌండే దిక్కయిన వైనం



పున్నమిఘాట్‌లో పరాధీనంలో ఉన్న ఘాట్ సెంటర్ పాయింట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదీ తీరాన 2016లో పుష్కరాలకు నాటి టీడీపీ ప్రభుత్వం నిర్మించిన పున్నమిఘాట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు వదిలేసి ఇప్పుడు పున్నమిఘాట్ పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యక్తులకు చెందిన బబ్బూరి గ్రౌండ్స్‌ను ప్రభుత్వం నిర్వహించే ఈవెంట్స్‌కు ఉపయోగించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాటి టీడీపీ ప్రభుత్వమే పున్నమిఘాట్‌కు కేంద్ర బిందువైన స్థలం విషయంలో కోర్టులో గెలిచిన ప్రైవేట్ వ్యక్తులకు ఎంతో కొంత ఇచ్చి సెటిల్ చేసుకుని ఉంటే ఈ రోజు ప్రైవేట్ స్థలాల వైపు చూసే అవసరం వచ్చేది కాదు కదా అన్నది ప్రజల వాదనగా ఉంది. నాడు అయినా.. నేడు అయినా ఈవెంట్ల పేరుతో 'షో' చెయ్యడం తెలుగుదేశం ప్రభుత్వానికి అలవాటు. నాడు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి కృష్ణానదీ తీరాన ఎయిర్ షో, పవర్ బోట్ రేసులు నిర్వహించింది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది దసరాకు కృష్ణానదీ తీరాన భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు 'శక్తి విజయోత్సవ్' కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తొలి రోజు ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, హోం శాఖ మంత్రి అనిత, సంక్షేమ శాఖ మంత్రి సవిత మాత్రమే హాజరయ్యారు.

రివర్ ఫ్రంట్‌లోని పున్నమిఘాట్ సింహభాగం పరాధీనం

గత కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రివర్ ఫ్రంట్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కుమ్మరించి నిర్మించిన పున్నమి ఘాట్‌లో సింహభాగం ప్రస్తుతం పరాధీనంలో ఉంది. 2016లో పున్నమిఘాట్ నిర్మాణం పూర్తయ్యాక కొంతమంది వ్యక్తులు పున్నమిఘాట్‌లో కొంత స్థలం (సర్వే నెంబర్లు 106/1, 106/2)లోని1.71 ఎకరాలు) తమదేనంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించటం, ఆ స్థలాన్ని వారికి అప్పచెప్పండంటూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అంతే కాకుండా కోర్టు ధిక్కారం కింద అప్పటి సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకు నాలుగు వారాల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. అప్పటివరకు నాటి టీడీపీ ప్రభుత్వంలోని జిల్లా యంత్రాంగం చోద్యం చూసింది తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన పున్నమిఘాట్‌కు కేంద్రబిందువైన స్థలాన్ని కోర్టుకు వెళ్లిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి చేతులు దులుపుకొంది. దాంతో కోర్టులో గెలిచిన ప్రైవేట్ వ్యక్తులు పున్నమిఘాట్‌లోని తమ స్థల హద్దుల మేరకు ప్రహరీ కట్టుకున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఏ ఈవెంట్ నిర్వహించాలన్నా ప్రైవేట్ స్థలాన్ని ఆశ్రయించక తప్పని దుస్థితి నెలకొంటోంది.



పున్నమిఘాట్‌కు ఉత్తరం వైపు ప్రవేశ ద్వారం వద్ద ప్రైవేట్ వ్యక్తులు నిర్మించిన ప్రహరీ

కూటమి పాలనలో దళితులపై దాడులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన దళిత నాయకులు కూడా ఈ దాడులను ఖండించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కైకలూరు నియోజకవర్గం దానగూడెం గ్రామంలో దళితులపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజా సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని దళితులపై దాడులను ఖండించారు. ఈ సందర్భంగా ఐఆర్‌ఎస్ మాజీ అధికారి ఉప్పులేటి దేవి ప్రసాద్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ బాబు, జై భీం రావు పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ.. దాడులకు వ్యతిరేకంగా అక్టోబర్ 18న ఏలూరులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్, బీకేసీ పార్టీ జాతీయ నాయకులు తిరుమావళన్ ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో మాలమహానాడు నేతలు తుమ్మల ఫ్రాన్సిస్, బేతాళ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటాం



పార్కులో వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రం చేస్తున్న సులభ్ సిబ్బంది



47వ డివిజన్‌లో జరిగిన ర్యాలీలో కార్పొరేటర్ గోదావరి గంగ, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రమదానం చేసి పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని, ఇందు కోసం ప్రతి రోజూ కొంత సమయాన్ని కేటాయిస్తానని సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛతా హి సేవా (స్వచ్ఛ్ ఉత్సవ్) కార్యక్రమంలో భాగంగా బుధవారం సంస్థ ఆధ్వర్యంలో సిబ్బంది నగరంలోని వివిధ ప్రాంతాల్లోని సులభ్ టాయిలెట్స్‌తోపాటు రోడ్లు, పార్కుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని విద్యార్థులతో కలిసి తొలగించి శుభ్రం చేశారు. తొలుత విద్యార్థులు, సులభ్ సంస్థ సిబ్బంది కలిసి పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఏపీ స్టేట్ బ్రాంచ్ కంట్రోలర్ విజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ ఒక సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌గా ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతను అందరి బాధ్యతగా మార్చడం తమ లక్ష్యమన్నారు. పరిశుభ్రత అనేది ఒక సేవగా భావించి చేయాలని కోరారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆదర్శాలను అనుసరించి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

47వ డివిజన్ పరిధిలో...

చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ (స్వచ్ఛ్ ఉత్సవ్) కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గోదావరి గంగ పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు, వీఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రం చేశారు. తొలుత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ సూర్యకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై అవగాహన పెంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఆర్థిక మోసాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ కంపెనీ సెక్రటరీ పాయల్‌గుప్తా అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో పెట్టుబడులు పెట్టడం - హక్కులు, బాధ్యతలను తెలుసుకోవటం అంశంపై సదస్సును బుధవారం ఆ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాయల్‌గుప్తా మాట్లాడుతూ పెట్టుబడి రంగంలో ప్రతి ఇన్వెస్టర్ తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. ఆర్థిక మోసాలపైన అప్రమత్తంగా ఉండాలన్నారు. పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవటం, చట్టపరమైన నిబంధనలు పాటించటం వంటి అంశాలపై ఆమె సవివరంగా వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.శరవణకుమార్ పాల్గొన్నారు.

డివిజన్ వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్ వ్యాప్తంగా పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. విజయవాడలో జరిగిన కార్యక్రమాల్లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా పాల్గొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఉద్యోగులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ ప్రచార కార్యక్రమాల్లో విజయవాడ డివిజన్ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. స్వచ్ఛత కేవలం ప్రచారం కోసం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగానే డివిజన్ వ్యాప్తంగా క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్ పేరుతో స్టేషన్ పరిసరాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు కల్పించడం, సఫాయి మిత్ర సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్య భద్రత చర్యలు తీసుకోవడం, క్లీన్ గ్రీన్ ఉత్సవాల పేరుతో పర్యావరణ అనుకూలమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత చర్యలు, పరిశుభ్రత డ్రైవ్‌ల నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రైల్వేస్టేషన్, కార్యాలయాలలో ఉద్యోగులతో కలసి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులతో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ జనరల్ హాస్పిటల్‌లో బుధవారం 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి పాల్గొని మహిళలు ఎదుర్కొనే పలు వ్యాధులు, చికిత్స, నివారణలపై మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణులకు రక్తహీనత నివారణ, రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, పరిసర ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 51, 53 డివిజన్‌ల కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీ, గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి, డాక్టర్ సాయిరాం, డాక్టర్ గౌస్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.



షేక్ రాజాసాహెబ్ హాస్పిటల్‌లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైభవంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామరాజు హరీష్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు పార్టీ నేతలు విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. విశ్వకర్మ జయంతిని మొట్టమొదటిగా అధికారికంగా నిర్వహించిన ఘనత జగనన్న సర్కార్‌కు చెందుతుందని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఆర్టిజన్ సెల్ అధ్యక్షుడు కేదారి ప్రసాద్, పశ్చిమ ఆర్టిజన్ సెల్ అధ్యక్షురాలు అండలూరి లత, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సున్నపు వీరభద్రాచారి, భ్రమరాంబ, రత్నమాచారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దప్రోలు బ్రహ్మం, కోశాధికారి నడిపల్లి ప్రసాద్, గొర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత సంఘ పెద్దలందరూ విశ్వకర్మ చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరిట 150 మంది విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేశారు. కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, కార్యవర్గ సభ్యులు విస్సాకోటి నాగాచారి, కరిమెళ్ల జగన్, కొత్తుర్తి బ్రహ్మాచారి, వాడపల్లి ఉమ, టేకి మధు, కోడూరి శ్రీకాంత్, తరుణి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కామరాజు హరీష్‌కుమార్



జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



నగర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న శ్రీకాంత్ తదితరులు

నగర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం సంఘ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దప్రోలు బ్రహ్మం, కోశాధికారి ఎస్.ప్రసాద్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం నాయకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా విశ్వబ్రాహ్మణ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరున 150 మందికి నగరంలోని విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు విస్సాకోటి నాగాచారి, కరిమెళ్ల జగన్, కొత్తుర్తి బ్రహ్మచారి, వాడపల్లి ఉమ, టేకి మధు, కోడూరి శ్రీకాంత్, తరుణి శంకర్, సంగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తోలేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో...

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవాళి సృష్టికర్త, చేతి వృత్తులకు మూలపురుషుడు అయిన శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మానవుడి జీవన విధానానికి అవసరమైన సకల వస్తువులను, అన్ని యుగాలలో ఇంద్రప్రస్థ, ద్వారక, మయసభను సృష్టించిన దేవత వాస్తు శిల్పి శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ అన్నారు. గత ప్రభుత్వంలో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. తొలుత శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు ముండూరి సత్యవతి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ధవళేశ్వరపు రవిశంకర్, జవ్వాది సుధీర్, పి.ప్రసాద్, జి.రమేష్, సత్యనారాయణ, మహిళా సంఘ సభ్యులు దుర్గ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం రోడ్‌లో 22 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం 40వ డివిజన్ పరిధిలో గల కోళ్లఫారం రోడ్‌లో ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించనున్న పందిరి వద్ద బుధవారం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ దసరా శరన్నవరాత్రి మహోత్సవంలో తొలిరోజు ఉదయం 7గంటలకు కృష్ణానది నుంచి కలశాలతో పవిత్ర జలాన్ని ఊరేగింపుగా తీసుకువస్తామని అన్నారు. అనంతరం అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరిస్తామని చెప్పారు. ఈనెల 23న శ్రీగాయత్రీ దేవిగా, 24న శ్రీఅన్నపూర్ణా దేవిగా, 25న శ్రీకాత్యాయనీ దేవిగా, 26న శ్రీమహాలక్ష్మి దేవిగా, 27న శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా, 28న శ్రీమహాచండీ దేవిగా, 29న శ్రీసరస్వతీ దేవి (మూలా నక్షత్రం)గా, 30న శ్రీదుర్గాదేవి (దుర్గాష్టమి)గా, అక్టోబర్ 1న శ్రీమహిషాసురమర్ధినీ దేవిగా, 2న శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తుందని వివరించారు. ఉత్సవాల్లో చివరి రోజు 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు అమ్మవారిని అలంకరించిన చీరెలు, లడ్డూ ప్రసాదాన్ని వేలం వేస్తామని, 6గంటలకు భేతాళ బృందంతో ఊరేగింపు ఉంటుందని చెప్పారు.



దసరా ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మైనార్టీల ద్రోహి ఎమ్మెల్యే గద్దే : దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లింల చిరకాల ఆకాంక్ష అయిన షాదీఖానా నిర్మాణ పనులను నిలిపివేసి, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ మైనార్టీలకు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. పిచ్చయ్యవీధి చివర బందరు కాల్వ ఒడ్డున గత ప్రభుత్వంలో ప్రారంభించిన షాదీఖానా పనులు నేటికీ పూర్తి కాకుండా, మధ్యలో నిలిపివేయడంతో దానిని వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం పరిశీలించారు. తొలుత వైవీరావు ఆస్పత్రి రోడ్డులోని కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం కార్యాలయం నుంచి పార్టీ నేతలు, ముస్లిం మైనార్టీలు షాదీఖానా వరకూ ర్యాలీగా వెళ్లారు.

అబద్ధాలు చెబుతూనే ఉన్నారు..

దేవినేని అవినాష్ మాట్లాడుతూ మైనార్టీల చిరకాల కోరిక అయిన షాదీఖానా నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించామన్నారు. మైనార్టీల కోసం నాడు వైఎస్ జగన్ ఆర్అండ్‌బీ స్థలాన్ని మున్సిపల్ శాఖకు బదిలీ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా నిర్మాణం పూర్తి కాలేదని ఆరోపించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ మైనార్టీలను మోసం చేశారన్నారు. ఆయన 2014 నుంచి షాదీఖానా విషయంలో అబద్ధాలు చెబుతూనే ఉన్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు పోతిన మహేష్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్బీపేట షాదీఖానా ఎదుట నిరసన తెలుపుతున్న అవినాష్, విష్ణు, భాగ్యలక్ష్మి, ఆసిఫ్, మహేష్ తదితరులు

స్టెల్లా కళాశాలలో గురజాడ జయంతి



పటమట(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాల సందర్భంగా తరుణి తరంగాలు, స్టెల్లా కళాశాల గ్రంథాలయ విభాగం సంయుక్తంగా కన్యాశుల్కంలో మధుర వాణి పాత్ర అనే అంశంపై బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు ధైర్యంగా ప్రతి సమస్యను ఎదుర్కోవాలని సూచించారు. లక్ష్యం దిశగా అడుగులు వేయాలని తెలిపారు. బాల్యా వివాహాలు అరికట్టడంలో గురజాడ కృషి అనిర్వచనీయమన్నారు. జన శిక్షణ సంస్థాన చైర్ పర్సన్ డాక్టర్ విద్య కన్నా మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం గురజాడ పునాది వేయటం వల్లే నేడు ఇంత మంది మహిళలు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నారని పేర్కొన్నారు. విశ్రాంత ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ గురజాడ విశిష్ట సేవలను స్మరించుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్టెల్లా కళాశాల డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నాం, లైబ్రేరియన్ విశాలాక్షి, హేమలత, లిడియా, తరుణి తరంగాలు డైరెక్టర్ పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.